
సాక్షి అనంతపురం

శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.25,260

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25,260 పలికాయి.



కిలో టమాట రూ.20

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.14 చొప్పున క్రయవిక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం 35.9°/13.9°

జిల్లా అంతటా శుక్రవారం చలి వాతావరణం కొనసాగుతోంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఈశాన్యం దిశగా గంటలకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

భూముల ధరకు రెక్కలు



అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తరలి వచ్చిన క్రయవిక్రయదారులు

కూటమి పాలనలో బాదుడు కొనసాగుతోంది. అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే నిత్యావసరాల ధరలను భారీగా పెంచేసింది. రెండు నెలల క్రితం విద్యుత్ చార్జీల మోత మోగించింది. తాజాగా భూముల మార్కెట్ విలువను అమాంతం పెంచేందుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారం అథఃపాతాళానికి పడిపోయింది. ఈ తరుణంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 నుంచి 20 శాతం మేర పెరగనుండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం మరింత కుదేలు కానుంది.

భారీగా పెంచిన కూటమి సర్కార్

- ఉమ్మడి జిల్లాలో 15 - 20 శాతం పెంపు
- పెరిగిన విలువలు నేటి నుంచి అమలులోకి
- మార్కెట్ విలువ పెంపుతో రియల్ ఎస్టేట్ మరింత కుదేల్

అనంతపురం టౌన్: భూముల మార్కెట్ విలువలు నేటి నుంచి పెరగనున్నాయి. అర్బన్ పరిధిలో 20 శాతం మేర పెంచుతూ సర్కారు నిర్ణయం తీసుకుంది. ప్రధానంగా అనంతపురం నగరం, కదిరి, హిందూపురం, పెనుకొండ, గుంతకల్లు తదితర ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం ఓ మేర జరుగుతుంది. అలాంటి ప్రాంతాల్లో 20 శాతం మేర మార్కెట్ విలువ పెరుగుతోంది. మిగిలిన ప్రాంతాల్లో 15 శాతం మేర పెరగనున్నాయి. కమర్షియల్ ప్రాంతాల్లో 30 నుంచి 50 శాతం మేర పెంచుతోంది. అనంతపురం అర్బన్ పరిధిలో డోర్ నంబర్ ఆధారంగా మార్కెట్ విలువలు నిర్ణయిస్తారు. కార్పొరేషన్ పరిధిలో చదరపు గజానికి ప్రస్తుతం రూ.25 వేలకు పైగానే ఉంది. దీంతో పాటు ఇంటిని రిజిస్ట్రేషన్ చేయాలంటే చదరపు అడుగుకు రూ.1800 మేర విలువ ఉంది. ప్రస్తుతం మార్కెట్ విలువ పెంపుతో అదనంగా 20 శాతం మేర అంటే చదరపు గజానికి రూ.30 వేలతోపాటు ఇంటికి చదరపు అడుగుకు రూ.2,160 చొప్పున వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుంది. వీటిని క్రయవిక్రయాలు జరిపినపుడు మొత్తం విలువలో సేల్‌డీడ్, గిఫ్ట్ డీడ్, పార్టీషన్ డీడ్‌ను బట్టి 4 శాతం నుంచి 7.5 శాతం వరకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇక జాతీయ రహదారుల పక్కనే ఉన్న భూముల విలువలు ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ కంటే 4 రెట్లు అదనంగా పెరగనున్నాయి.

నేటి నుంచి అమల్లోకి..

పెరిగిన మార్కెట్ విలువలు నేటి (శనివారం) నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అమలులోకి రానున్నాయి. అనంతపురం జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, శ్రీసత్యసాయి జిల్లాలో 9 సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో పెరిగిన మార్కెట్ విలువల మేరకు నేటి నుంచి స్థిరాస్తుల క్రయ, విక్రయదారులు అదనపు రుసుములు చెల్లించి డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిట

ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి మార్కెట్ విలువలు పెరుగుతుండడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాలు క్రయ, విక్రయదారులతో శుక్రవారం కిటకిటలాడాయి. ఈరోజే స్థిరాస్తులు రిజిస్ట్రేషన్ చేసుకుంటే కొద్ది మేర అయినా డబ్బులు మిగులుతాయనే ఆశతో భూముల కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్లు పెట్టుకున్నారు. గతంలో ఒక్కో కార్యాలయంలో రోజుకు పదికి పైగా డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగేవి. అయితే శుక్రవారం ఏకంగా ప్రతి కార్యాలయంలోనూ 50 డాక్యుమెంట్లకు పైగానే రిజిస్ట్రేషన్లు జరిగాయి.

నేటి నుంచి కొత్త రేట్లు



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పెరిగిన స్థిరాస్తుల మార్కెట్ రేట్లు శనివారం నుంచి అందుబాటులోకి వస్తాయి. పెరిగిన మార్కెట్ విలువల నివేదికలను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపాం.

– విజయలక్ష్మి, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, అనంతపురం



అనంతపురం నగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద రద్దీ

భూముల మార్కెట్ విలువ (చదరపు గజానికి)

ప్రాంతం	ప్రస్తుతం ච.గజానికి	పెరిగే విలువ చ.గజానికి
అనంతపురం అర్బన్	రూ.25వేలు	రూ.30వేలు
పాపంపేట	రూ.10వేలు	రూ.12వేలు
బుక్కరాయసముద్రం	రూ.5వేలు	రూ.6వేలు
పుట్టపర్తి	రూ.7,700	రూ. 9,240
హిందూపురం	రూ.10,000	రూ.12,000
కదిరి	రూ.6,000	రూ.7,200

నారాయణను మంత్రివర్గం నుంచి తప్పించాలి

- విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్
- జిల్లాలో విద్యా సంస్థల బంద్ విజయవంతం



నారాయణ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా నారాయణ విద్యా సంస్థల్లో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలకు బాధ్యులను చేస్తూ మంత్రి నారాయణను మంత్రివర్గం నుంచి తప్పించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురంలో నారాయణ కళాశాల విద్యార్థి ఆత్మహత్య ఘటన నేపథ్యంలో నారాయణ విద్యా సంస్థల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, కళాశాలను సీజ్ చేయాలనే డిమాండ్‌తో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. చాలా స్కూళ్లు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. వివిధ స్కూళ్లను విద్యార్థి సంఘాల నాయకులు వెళ్లి బంద్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి ఆత్మహత్య చేసుకుని వారం రోజులవుతున్నా ఇప్పటిదాకా నారాయణ విద్యా సంస్థలపై కనీస చర్యలు తీసుకోలేదన్నారు. తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. విద్యాసంస్థల యజమాని మంత్రి కావడంతోనే కేసు నమోదులో పోలీసులు వెనకడుగు వేస్తున్నారని ఆరోపించారు. ఆర్ఐఓ ఇప్పటిదాకా కళాశాల వైపు కన్నెత్తి చూడలేదన్నారు. విద్యార్థి మృతి ఘటనపై ప్రభుత్వం స్పందించకపోతే ప్రజల్లో తీవ్ర చెడ్డపేరు వస్తుందన్నారు. బాధ్యులుగా నారాయణ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి నరేష్, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పృథ్వీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సురేష్‌యాదవ్, పీఎస్‌వీఐ రాష్ట్ర కార్యదర్శి వినోద్‌కుమార్, ఆయా సంఘాల నాయకులు వంశీ, చందు, మంజు, నాని, సమీర్, సాయికార్తీక్, సిద్ధు, సోము, చంద్ర, సాయి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అర్ధంతరంగా జీవితాలు ముగియరాదు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ప్రాణాలు విలువైనవని.. రోడ్డు ప్రమాదాల కారణంగా అర్ధంతరంగా జీవితాలు ముగియకూడదని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్డు భద్రత అంశంపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు తరచూ జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రోడ్డు భద్రతపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఆర్టీటీ స్టేడియం సమీపంలోని పంగల్ రోడ్డు వద్ద వంతెనకు మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలన్నారు. నగరంలో 206 సీసీ కెమెరాల ఏర్పాటుకు సంబంధించి టెండర్లను పూర్తి చేసి ఈ నెల 15లోగా అమర్చాలని, లేని పక్షంలో చర్యలు ఉంటాయని మునిసిపల్ అధికారులను హెచ్చరించారు. అనంతపురం అర్బన్, రూరల్, గుంతకల్లు, కళ్యాణదుర్గం, తాడిపత్రి పట్టణం, మండలాల పరిధిలో గుర్తించిన 37 బ్లాక్ స్పాట్ల వద్ద హైమాస్ లైట్లు, హెచ్చరిక బోర్డులు, ఇనుప గ్రిల్, సిగ్నళ్లు వంటివి 15 రోజుల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, డీఎస్పీ శ్రీనివాసరావు, డీటీసీ వీర్రాజు, ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, డీఎంహెచ్ఓ ఈబీ. దేవి, డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ మల్లికార్జునరెడ్డి, ఎన్టీఆర్ వైద్యసేవ కో–ఆర్డినేటర్ కిరణ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చుక్కల భూముల సమస్య పరిష్కారానికి చర్యలు

నిషేధిత భూముల జాబితాలో ఉన్న చుక్కల భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. జిల్లాస్థాయి చుక్కల భూముల కమిటీ సమావేశాన్ని కలెక్టర్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిషేధిత జాబితాలో చుక్కల భూములను తొలగించేందుకు, ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందుతున్న అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇక నుంచి ప్రతి వారం జిల్లాస్థాయి చుక్కల భూముల కమిటీ సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఐదు కేసులను విచారించారు.

సచివాలయాలకు 'ఇంటర్నెట్' కట్



గుత్తిలోని వార్డు సచివాలయం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో 11 సచివాలయాలకు ఇంటర్నెట్ సౌకర్యాన్ని తొలగించారు. మొత్తం 12 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 11వ వార్డు సచివాలయం మినహా మిగిలిన సచివాలయాలకు అధికారులు ఇంటర్నెట్ బిల్లులు చెల్లించకపోవడంతో కనెక్షన్ కట్ అయినట్లు సమాచారం. దీంతో సచివాలయ ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మూడువారాలుగా ఇదే పరిస్థితి నెలకొంది.

రేపు 'జీవ్‌జంత్ కల్యాణ్ దివస్'

అనంతపురం అగ్రికల్చర్: వసంత పంచమిని పురస్కరించుకుని ఈ నెల 2న ప్రాంతీయ పశు వైద్యశాలల్లో 'జీవ్‌జంత్ కల్యాణ్ దివస్' కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శీతాకాలం ముగింపును సూచించే వసంత రుతువులో ఐదో రోజు అంటే వసంత పంచమి అనేది జంతువులు, వన్యప్రాణులకు చాలా ఉత్తమమైన కాలమన్నారు. ఈ క్రమంలో అనిమల్ వెల్ఫేర్ బోర్డు ఏటా వసంత పంచమి రోజున జాతీయ స్థాయిలో జీవ్ జంతు కళ్యాణ్ దివస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశువులు, జీవాలకు అవసరమైన గడ్డి, తాగునీరు, వైద్యం తదితర వాటిని అందుబాటులో ఉండేలా రైతులు, కాపర్లకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

వెండి కిరీటం అపహరణ

పెద్దపప్పూరు: చింతరపల్లిలోని చౌడేశ్వరీ ఆలయంలో వెండి కిరీటం అపహరణకు గురైంది. శుక్రవారం సాయంత్రం అమ్మవారికి పూజలు చేయాలని వెళ్లిన భక్తులు.. ఆలయ తాళం పగులగొట్టి ఉండడం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించారు. అమ్మవారి మూలవిరాట్‌కు అలంకరించిన వెండి కిరీటం, వెండి గొడుగులు, కోర మీసాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చోరీ అయిన సొత్తు విలువ రూ.1.30 లక్షలకు పైగా ఉంటుందని గ్రామస్తులు వివరించారు.

మొదటి సంతకం ఏమైంది బాబూ?



డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు, డీఎస్సీ అభ్యర్థులు

- డీవైఎఫ్ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: సీఎం చంద్రబాబు తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీ నిర్వహణపై నేటికీ స్పష్టత లేకుండా పోయిందని డీవైఎఫ్ఐ నాయకులు మండిపడ్డారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని డీఎస్సీ అభ్యర్థులు ముట్టడించారు. ఒంటికాలిపై నిలబడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ నిరుద్యోగ అభ్యర్థులు మెగా డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. స్వయంగా చంద్రబాబు తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడు రిలీజ్ చేస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే అభ్యర్థులు కోచింగ్‌లు, పుస్తకాలు, గదుల అద్దెలకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి అప్పులపాలయ్యారన్నారు. నోటిఫికేషన్ అంశంపై ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ... జిల్లాలో పోస్టుల భర్తీ విషయంలో నిరుద్యోగులకు అన్యాయం జరిగితే సహించబోమని హెచ్చరించారు. నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు. నాయకులు నూరుల్లా, సురేంద్ర, చరణ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత చేసిన తొలి సంతకం ఏమైంది బాబూ అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నిరుద్యోగ అభ్యర్థులు షేక్ ముజీబ్, రమేష్, లావణ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు అండగా 'ఫీజు పోరు'

- ఈ నెల 5న భారీ ర్యాలీతో కలెక్టర్‌కు వినతి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



'ఫీజు పోరు' పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, గిరిజమ్మ తదితరులు

అనంతపురం కార్పొరేషన్: విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వం మెడలు వంచడానికి ఈ నెల ఐదో తేదీ 'ఫీజు పోరు' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో 'ఫీజు పోరు' పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మూడు త్రైమాసికాల్లో ఫీజు చెల్లించారన్నారు. 2014–19 టీడీపీ ప్రభుత్వంలో రూ.1,780 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కలుపుకుని అప్పుడు విద్యార్థులకు ఇవ్వాల్సిన మొత్తం రూ.4వేల కోట్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విడుదల చేసిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో ఎనిమిది నెలలవుతున్నా ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను పరీక్షలకు నిరాకరించి మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయన్నారు. నారాయణ కళాశాల యాజమాన్యం ఒత్తిళ్లు తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడిన సందర్భాలు లేకపోలేదన్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోతే ఉద్యమిస్తామన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల ఐదో తేదీన 'ఫీజు పోరు' కార్యక్రమంలో భాగంగా అనంతపురంలో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులతో కలిసి ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ నుంచి ర్యాలీ ప్రారంభమై సప్తగిరి సర్కిల్ మీదుగా కలెక్టర్ ఆఫీస్ వరకు సాగుతుందన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విప్లవాత్మక సంస్కరణలతో విద్యార్థుల ఉన్నత చదువులు చదివేందుకు కృషి చేశారన్నారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా తీరని అన్యాయం చేస్తోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌గర్ రిజ్వాన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి గురుశేఖర్ బాబు, పార్టీ నగరాధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు సాకే చంద్ర, బాకే హబీబుల్లా, శ్రీనివాస్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాస గురుదత్తా, నాయకులు అనిల్‌కుమార్ గౌడ్, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల సందడి

- నేడు 'నైతికత – మానవతా విలువలు' పరీక్ష...
- మూడో తేదీ పర్యావరణ విద్య పరీక్ష
- ఈ నెల 5 నుంచి ప్రాక్టికల్స్
- మార్చి 1 నుంచి థియరీ పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: కీలకమైన ఇంటర్ పరీక్షల సందడి ప్రారంభమైంది. శనివారం జరగనున్న 'నైతికత–మానవతా విలువలు' పరీక్షతో ఇంటర్ వార్షిక పరీక్షలు మొదలుకానున్నాయి. వరుసగా ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలు ఉండడంతో విద్యార్థుల్లో టెన్షన్ మొదలైంది. 'నైతికత–మానవతా విలువలు' పరీక్ష అనంతరం ఈ నెల మూడో తేదీన పర్యావరణ విద్య పరీక్ష ఉంటుంది. ఆ తర్వాత 5 నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు జరగనున్నాయి. పదో తేదీ నుంచి ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 20వ తేదీ నాటికి పూర్తవుతాయి. మొత్తం 93 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ జరగనున్నాయి. ఒకేషనల్ విద్యార్థులు 4,014 మంది, ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు 18,591 మంది హాజరుకానున్నారు. ప్రాక్టికల్స్ పరీక్షలు రోజూ రెండు విడతలుగా జరుగుతాయి. తొలివిడత ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయి.

మార్చి 1 నుంచి థియరీ పరీక్షలు

ఇంటర్ థియరీ పరీక్షలు మార్చి 1న ప్రారంభమై 20న ముగుస్తాయి. జిల్లాలో మొత్తం 63 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం జనరల్, ఒకేషనల్ కలిపి 48,690 మంది విద్యార్థులు ఈసారి పరీక్షలు రాయనున్నారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 25,730 మంది కాగా... అందులో 12,397 మంది బాలురు, 13,333 మంది బాలికలు ఉన్నారు. అలాగే ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 22,960 మంది కాగా...అందులో 11,064 మంది బాలురు, 11,896 మంది బాలికలు ఉన్నారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలుంటాయి.



జూనియర్ కళాశాలల ఉద్యోగులకు ఆన్సర్ షీట్లు అందజేస్తున్న ఆర్ఐఓ కార్యాలయ సిబ్బంది

జిల్లాకు చేరిన ఆన్సర్ షీట్లు

'నైతికత–మానవతా విలువలు', 'పర్యావరణ విద్య పరీక్ష'తో పాటు ప్రాక్టికల్, థియరీ పరీక్షలకు సంబంధించి ఆన్సర్ షీట్లు జిల్లాకు చేరాయి. ఇంటర్ బోర్డ్ ఆర్ఐఓ కార్యాలయ భవనంపై ఉన్న గోడౌన్‌లో భద్రపరిచారు. నైతికత–మానవతా విలువలు, పర్యావరణ విద్య, ప్రాక్టికల్స్ పరీక్షలకు సంబంధించి ఆన్సర్ షీట్లను కళాశాలలకు పంపిణీ చేశారు. థియరీ పరీక్షల ఆన్సర్ సీట్లు మాత్రం గోడౌన్‌లోనే భద్రపరిచారు.

అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాం

ఇంటర్ పరీక్షల సీజన్ ప్రారంభమైంది. పరీక్షల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాం. నైతికత–మానవతా విలువలు, పర్యావరణ విద్య పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు విధిగా హాజరుకావాలి. 5 నుంచి ప్రాక్టికల్స్, మార్చి 1న థియరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కలెక్టర్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రశాంతంగా జరిగేలా చూస్తాం.

– వెంకరమణనాయక్, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్ఐఓ), ఇంటర్ బోర్డు

రీ-సర్వే సందేహాల నివృత్తికి కాల్ సెంటర్

అనంతపురం అర్బన్: భూముల రీ సర్వేలో భూ యజమానులకు, సర్వే, రెవెన్యూ సిబ్బందికి వచ్చే సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. కాల్ సెంటర్ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలందిస్తుందని పేర్కొన్నారు. 87126 14745 నంబర్‌కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని సూచించారు.

కొత్త స్టేషన్.. సమస్యల సైరన్

- రాయదుర్గం జంక్షన్‌లో ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- ఏడాదికిపైగా 'తిరుపతి-కదిరిదేవరపల్లి' రైలు రద్దు
- కనిపించని మౌలిక వసతులు
- 'దుర్గం' స్టేషన్‌పై రైల్వేశాఖ శీతకన్ను


ప్లాట్‌ఫారాలపై షెల్టర్ ఏర్పాటు చేయని దృశ్యం

రాయదుర్గం టౌన్: విస్తరిలో పంచభక్ష పరమాన్నాలు వడ్డించి చివరకు చేతులు కట్టేసినట్లేంది రైల్వే ఉన్నతాధికారుల తీరు. కంటి ముందే అన్ని రకాల రైళ్లు పరుగులీస్తున్నా... రాయదుర్గం రైల్వే స్టేషన్‌లో అవి ఆగడం లేదు. ఇక్కడి రైల్వే స్టేషన్‌ను రూ.10.5 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసి అప్‌గ్రేడ్ చేసినా సమస్యలు మాత్రం అపరిష్కృతంగానే ఉండిపోయాయి.

ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు

రాయదుర్గం రైల్వేస్టేషన్ మీదుగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ రైళ్లకు రాయదుర్గంలో స్టాపింగ్ లేదు. ఈ అంశంపై రైల్వే అధికారులకు ప్రయాణికులు, స్వచ్ఛంద సంస్థలు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఉన్నతాధికారుల నుంచి స్పందన కరువైంది. గతంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలంటే తగినంత ప్లాట్‌ఫారం విస్తీర్ణం లేదనే సాకులు చెబుతుండేవారు. ప్రస్తుతం రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసిన తర్వాత దాదాపు 750 మీటర్ల పొడవునా ప్లాట్‌ఫారం అందుబాటులోకి వచ్చింది. అయినా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పించ లేదు. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు.. బళ్లారికి వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తోంది.

స్టాపింగ్ లేని రైళ్లు

ప్రతి మంగళ, గురువారాల్లో మైసూరు-వారణాసి, ప్రతి గురువారం యశ్వంతపుర-జైపూర్, ప్రతి ఆదివారం యశ్వంతపుర-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాయదుర్గం మీదుగా రాకపోకలు సాగిస్తాయి. వీటికి రాయదుర్గం స్టేషన్‌లో స్టాపింగ్ లేదు. ఈ రైళ్లను ఇక్కడ నిలిపితే దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. అంతేకాక ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలతో గార్మెంట్స్ పరిశ్రమ మరింత అభివృద్ధి చెంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

మూడు రెగ్యులర్, ఒక వారాంతపు రైలే గతి

ప్రస్తుతం రాయదుర్గం స్టేషన్‌కు కేవలం నాలుగు రైళ్ల స్టాపింగ్ మాత్రమే ఉంది. ఇందులోనూ ఒకటి వారాంతపు రైలు కావడం గమనార్హం. సింధనూరు-యశ్వంతపుర ఎక్స్‌ప్రెస్ రైలు, హొస్పేట-బెంగళూరు, గుంతకల్లు-చిక్‌జాజూర్ ప్యాసింజర్ రైళ్ల స్టాపింగ్ ఉండగా మైసూరు-సాయినగర్ షిర్డీ వారంతపు రైళ్ల రాకపోకలు ఉన్నాయి. అంతేకాక బెంగళూరుకు రాకపోకలకు సాగించేందుకు గతంలో రైలు వేళలు ఎంతో అనుకూలంగా ఉండేవి. ప్రస్తుతం వేళలు మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తిరుపతి-కదిరిదేవరపల్లి రైలు నిలిపివేత

రాయదుర్గం- తుమకూరు రైలు మార్గంలో ఆవులదట్ల, కళ్యాణదుర్గం, కదిరిదేవరపల్లి, దొడ్డహళ్లి వరకు రైల్వే స్టేషన్ల నిర్మాణం పూర్తయింది. అయితే ఈ మార్గంలో నడుస్తున్న తిరుపతి-కదిరిదేవరపల్లి రైలును దాదాపు ఏడాదికిపైగా నిలిపి వేశారు. దీంతో కళ్యాణదుర్గం, రాయదుర్గం, బళ్లారి, గుంతకల్లు నుంచి తిరుపతికి వెళ్లే పేదలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

దశాబ్దానికి పైగా నిర్మాణ దశనే

రాయదుర్గం - తుమకూరు రైలు మార్గం నిర్మాణ పనులు దశాబ్దానికి పైగా కొనసాగుతూ ఉన్నాయి. రూ.1714.50 కోట్ల అంచనాతో 2012లో 206.53 కిలోమీటర్ల పొడవు గల ఈ రైలు మార్గం నిర్మాణ పనులను ప్రారంభించారు. 2016లో కళ్యాణదుర్గం వరకు, 2017లో కదిరిదేవరపల్లి వరకు రైలుమార్గం పూర్తయింది. తిరుపతి-కదిరిదేవరపల్లి రైలు సర్వీసును ప్రారంభించారు. ప్రస్తుతం దొడ్డహళ్లి, రాంపుర వరకూ 103 కిలోమీటర్ల మేర పనులూ పూర్తయ్యాయి. మరో 104 కిలోమీటర్ల మేర నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. పనుల్లో అంతులేని జాప్యం కారణంగా నిర్మాణ అంచనా వ్యయం కాస్త రూ.2,450 కోట్లకు పెరిగింది.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి



గార్మెంట్స్ పరిశ్రమలోనే పేరుగాంచిన రాయదుర్గంలోని రైల్వే జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలి. ఎగుమతులు, దిగుమతులతో పాటు ప్రయాణికుల వల్ల రైల్వేకు ఆదాయం పెరుగుతుంది. ఈ విషయంగా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. స్టేషన్‌లో కనీస వసతులు మెరుగుపడాలి. దీనిపై రైల్వే ఉన్నతాధికారులు స్పందించాలి.

– గుడేకోట శివకుమార్, నైరుతి రైల్వే డివిజనల్ సలహా మండలి మాజీ సభ్యుడు, రాయదుర్గం

తిరుపతి ప్యాసింజర్‌ను పునరుద్ధరించాలి



కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజర్ రైలును తక్షణమే పునరుద్ధరించాలి. అభివృద్ధి పనుల పేరుతో ఏడాదిగా ఈ రైలును రద్దు చేయడం బాధాకరం. అలాగే రాయదుర్గం మీదుగా వెళ్లే ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలును ఇక్కడ ఆపితే గార్మెంట్స్ పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది.

– శివపుత్ర, గార్మెంట్స్ వ్యాపారి, రాయదుర్గం

కనీస మౌలిక వసతులు కరువు

రాయదుర్గం నుంచి తుమకూరుకు రైలు మార్గం పనులు చేపట్టిన తర్వాత రాయదుర్గం రైల్వేస్టేషన్‌ను జంక్షన్‌గా రైల్వే అధికారులు మార్చారు. అయితే ఆ స్థాయిలో ఇక్కడ మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారు. తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, నీడ వసతి లేవు. వెయింటింగ్ హాల్ ఉందో లేదో తెలియని పరిస్థితి. రైల్వే స్టేషన్ భవనం ఉన్న పరిధికి మాత్రమే ప్లాట్‌ఫారంపై షెల్టర్, బెంచీలు ఏర్పాటు చేశారు. మిగిలిన ప్లాట్‌ఫారంలో ఏ విధమైన షెల్టర్, కూర్చొనేందుకు బెంచీలు లేవు. మరోవైపు రెండో ప్లాట్‌ఫారం విస్తరణ, పైకప్పు ఏర్పాటు పనులు అతీగతీ లేకుండా పోయాయి. దీంతో రెండో ప్లాట్‌ఫారం నిరుపయోగంగా మారింది.



నిధుల కేటాయింపు జరిగేనా?

- ఇప్పటికే నూతన రైలు మార్గాలకు పూర్తయిన సర్వే
- పనుల అనుమతి కోసం ఎదురుచూపు
- కొత్త ఎక్స్‌ప్రెస్ రైళ్లకు గ్రీన్ సిగ్నల్ ప్రశ్నార్థకం
- నేడు పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్న కేంద్ర బడ్జెట్


గుంతకల్లు రైల్వే జంక్షన్

గుంతకల్లు: కేంద్ర బడ్జెట్‌లో గుంతకల్లు డివిజన్‌కు గత కొన్నేళ్లగా ఆశించిన స్థాయిలో నిధుల కేటాయింపులు జరగలేదు. దక్షిణ మధ్య రైల్వేలో ఆదాయ పరంగా గుంతకల్లు డివిజన్ ముందుంజలో ఉన్నా... బడ్జెట్ కేటాయింపులో మాత్రం ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తూనే వస్తోంది. ఫలితంగా గుంతకల్లు డివిజన్‌లో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. అంతేకాక చేపట్టిన పనులకూ అరకొరగానే నిధులు విడుదలవుతున్నాయి. రైల్వేకు ప్రత్యేక బడ్జెట్ ప్రవేశ పెట్టే విధానాన్ని 2016లోనే నిలిపివేశారు. ఈ నేపథ్యంలో రైల్వే అభివృద్ధికి సంబంధించి నిధుల కేటాయింపులు గణనీయంగా తగ్గింది. ఈ క్రమంలో శనివారం (నేడు) పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టే బడ్జెట్‌పై రాయలసీమ జిల్లా వాసులు కోటి ఆశలు పెట్టుకున్నారు.

నత్తనడకన రైల్వే ప్రాజెక్టులు

- 2016–17 బడ్జెట్‌లో గుంతకల్లు-గుంటూరు డబ్లింగ్ పనులకు ఆమోదం దక్కింది. మొత్తం 401.47 కి.మీల మేర డబ్లింగ్ పనులకు దాదాపు రూ.3,887 కోట్లు కేటాయించారు. ఇందులో దాదాపు 130 కి.మీలకు పైగా పనులు పూర్తయ్యాయి. గత బడ్జెట్ కేటాయించిన రూ.3,887 కోట్లకు గాను రూ.188 కోట్లను మాత్రమే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో మిగులు పనులు నత్తనడకన సాగుతున్నాయి.
- దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కడప-బెంగుళూరు మధ్య దాదాపు 255 కి.మీల ప్రాజెక్టుకు రూ.2,706 కోట్లను కేటాయిస్తూ 2008లో పనులకు ఆమోదం దక్కింది. అయితే ఆశించిన స్థాయిలో నిధులు మంజూరు కాకపోవడంతో ఈ మార్గంలోనూ పనులు మందగించాయి. దాదాపు 30 కి.మీల మేర పనులు పూర్తయ్యాయి.

సర్వే చేసిన పనులకు మోక్షం దక్కేనా?

2023 బడ్జెట్‌లో కొత్త రెలు మార్గాల కోసం సర్వేలకు అనుమతి కోరుతూ ప్రతిపాదనలు చేశారు. ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే రైలు మార్గాలు లేని ప్రాంతాల్లో నిర్మించి రైళ్లు పరుగు పెట్టే అవకాశం ఉంది. ఇందులో ప్రధానంగా ధర్మవరం-బళ్లారి మధ్య 130 కి.మీలు, రాయచోటి-హిందూపురం మధ్య 162 కి.మీలు, మంత్రాలయం-కర్నూలు మధ్య 100 కి.మీ, ముద్దనూరు-మదిగుబ్బ మధ్య 90 కి.మీల ప్రాజెక్టులు ఉన్నాయి.

కొత్త రైళ్ల రాక ఎన్నడో?



డివిజన్ కేంద్రామైన గుంతకల్లు జంక్షన్ నుంచి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపాలనే ప్రతిపాదనలు గత కొన్నేళ్లుగా అమలుకు నోచుకోలేకపోయాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, గుంతకల్లు డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్‌టెంట్ (డీఆర్‌యూసీసీ) సభ్యులు, డీఆర్‌ఎంలు, జోనల్ అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు పంపారు. అయితే ఇంత వరకూ ఏ ఒక్క ప్రతిపాదననూ కేంద్రం ఆమోదించలేదు. ఇందులో ధర్మవరం-గుంతకల్లు-కాచిగూడ డైలీ ఎక్స్‌ప్రెస్ రైలు, పుట్టపర్తి నుంచి షిర్డీకి, గుంతకల్లు-హైదరాబాద్, గుంతకల్లు-విజయవాడ మధ్య పగటి పూట ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపాలనే ప్రతిపాదనలు కీలకంగా ఉన్నాయి. అలాగే సికింద్రాబాద్-కర్నూలు మధ్య నడుస్తున్న తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలును గుంతకల్లు వరకు పొడగించాలనే డిమాండ్ సైతం ఇప్పటి వరకూ ఆచరణకు నోచుకోలేదు. ఈ క్రమంలో శనివారం పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో గుంతకల్లు డివిజన్‌కు ప్రాధాన్యత ఉంటుందో.. లేదో వేచి చూడాలి.

బాబు రాజకీయ జీవితమంతా మోసమే

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ధ్వజం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: సీఎం చంద్రబాబు రాజకీయ జీవితమంతా మోసమేనని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. ఆయన పేదల ద్వేషి అని, ప్రపంచంలో చంద్రబాబు మాదిరిగా ఎవ్వరూ అబద్ధాలు ఆడలేరని ఎద్దేవా చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అలవికాని హామీలు ఇవ్వడం.. గద్దెనెక్కిన తర్వాత అమలు చేయకుండా చేతులెత్తేయడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. రెండు రోజుల క్రితం 'సూపర్ సిక్స్' అమలు చేయలేమని స్పష్టంగా చెప్పారన్నారు. హామీలు అమలు చేయకపోతే కాలర్ పట్టుకుని ప్రశ్నించండని మంత్రి లోకేష్ చెప్పారన్నారు. మరి ఇప్పుడు ఎవరి కాలర్ పట్టుకోవాలో ఆయనే చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో అవినీతి తారస్థాయికి చేరిందని, బెల్టుషాపులు, జూద గృహాలు, అక్రమ బియ్యం రవాణా లాంటివి విచ్చలవిడిగా కొనసాగుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలను లక్ష్యంగా చేసుకున్న అక్రమ కేసులు బనాయిస్తున్నారని, వీటిని దీటుగా ఎదుర్కొంటామని చెప్పారు. అటవీ భూములు ఆక్రమించారంటూ రాష్ట్ర నాయకులు జోగి రమేష్, రాణితో పాటు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అక్రమ కేసులు పెడుతున్నారని, వీటికి భయపడే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో కూడేరు, ఉరవకొండ ఎంపీపీలు నారాయణరెడ్డి, వెలిగొండ నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్, శివలింగప్ప, వీరన్న, జగదీష్, బసవరాజు, ఎర్రిస్వామిరెడ్డి, ఈడిగప్రసాద్, ఆసీఫ్ పాల్గొన్నారు.

పాముకాటుతో రైతు మృతి


వెంకటేష్ (ఫైల్)

గుంతకల్లు రూరల్: మండలంలోని మైనాపురం గ్రామానికి చెందిన రైతు వెంకటేష్ (55) పాముకాటుతో మృతిచెందాడు. తన పొలంలో సాగు చేసిన వేరుశనగ పంటకు శుక్రవారం సాయంత్రం నీరు పెడుతున్న సమయంలో పాము కాటు వేసింది. అయితే గమనించని వెంకటేష్ పొలంలో పనిచేసుకుంటూ కాసేపటి తర్వాత స్పృహ కోల్పోయాడు. గమనించిన పక్క పొలంలోని రైతులు వెంటనే ఆటోలో ఇంటికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కుటుంబసభ్యులు గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. కాగా, వెంకటేష్‌కు భార్య తులసమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

5న హార్టికల్చర్ కాంక్లేవ్

- కలెక్టర్ వినోద్‌కుమార్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: ఈ నెల 5న నిర్వహించనున్న 'అనంత హార్టికల్చర్ కాంక్లేవ్' కార్యక్రమానికి సంబంధించి అన్ని విధాలుగా సిద్ధం కావాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. కాంక్లేవ్ నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన సమీక్షించారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావులకేశవ్, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ తదితరులు హాజరుకానున్న నేపథ్యంలో అనంతపురంలోని బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్ వేదికగా కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్యక్రమానికి విచ్చేసే వీఐపీలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా వసతి ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఆహ్వానాలు, ఎంఓయూలు, ప్యానెల్ డిస్కషన్లు, టెక్నికల్ సెషన్ కోసం మెటీరియల్ ప్రింటింగ్, తదితరాలు ప్రణాళికాబద్ధంగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారికి గుర్తింపు కార్డులు సిద్ధం చేయాలన్నారు. ఏ కేటగిరీలో అవార్డులు ఇస్తున్నామనేది ఫైనలైజ్ చేయాలని ఆదేశించారు. వీసీలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఢిల్లీ నుంచి వచ్చిన ఈవెంట్ నిర్వాహకుడు సౌవిక్ గోస్వామి, ఉద్యాన శాఖ డీడీ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ ఫిరోజ్ ఖాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'అనంత' తపాలా ఎస్పీ బదిలీ

అనంతపురం సిటీ: అనంతపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ (ఎస్పీ) ఎం.గుంపుస్వామిని ఆదిలాబాద్ డివిజన్‌కు బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. అనంతపురం పోస్టల్ ఎస్పీగా ఆయన విధులు తీసుకున్నప్పటి నుంచి ఉద్యోగుల పట్ల ఆయన తీరు వివాదాస్పదంగానే ఉంటూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఆయన బదిలీ ప్రాధ్యానతను సంతరించుకుంది.

కల్యాణమంటపం వద్ద గుర్తు తెలియని మృతదేహం



తాడిపత్రి టౌన్: స్థానిక రజక కల్యాణమంటపం వద్ద శుక్రవారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడికి దాదాపు 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని సీఐ సాయి ప్రసాద్ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తాడిపత్రి పోలీసులను సంప్రదించాలని కోరారు.

టిప్పర్ దగ్ధం

- విద్యుత్ షాక్‌తో డ్రైవర్ మృతి


మంటల్లో కాలిపోతున్న టిప్పర్(ఇన్‌సెట్‌లో) సైపుల్లా (ఫైల్)

రాయదుర్గం: విద్యుత్ షాక్‌తో ఓ టిప్పర్ దగ్ధమైంది. ప్రమాదం నుంచి తప్పించుకునే క్రమంలో వాహనం నుంచి కిందకు దూకిన డ్రైవర్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాలు... రాయదుర్గం మండలం కదరంపల్లికి చెందిన మస్తానప్ప, జైనాబీ దంపతుల ఏకైక కుమారుడు సైపుల్లా (31) టిప్పర్ ఏర్పాటు చేసుకుని సొంతంగా డ్రైవింగ్‌కు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య భానుబీ, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాడుగలో భాగంగా గురువారం సాయంత్రం లోడింగ్ కోసం డి.హీరేహాళ్ మండలం సోములాపురం రైల్వే యార్డు వద్దకు టిప్పర్‌ను తీసుకుని సైపుల్లా వెళ్లాడు. రాత్రికి అక్కడే ఉండి, శుక్రవారం ఉదయమే వాహనానికి గ్రీజ్ పెట్టేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో లిఫ్ట్ ఎత్తడంతో పైనున్న 11కేవీ విద్యుత్ లైన్‌ను తాకి ఒక్కసారిగా విద్యుత్ ప్రసరించి మంటలు చెలరేగాయి. గమనించిన సైపుల్లా డ్రైవింగ్ సీట్‌లో నుంచి కిందకు దూకాడు. ఈ సమయంలో అనుకోకుండా వాహనం డోర్‌ను తాకడంతో షాక్‌కు గురై కుప్పకూలాడు. మంటలు ఎగిసి పడి టిప్పర్‌ను చుట్టుముట్టేయడంతో వాహనం పూర్తిగా కాలిపోయింది. అక్కడున్న వారు గమనించి సైపుల్లాను పక్కకు లాగారు. అప్పటికే అపస్మారకస్థితికి చేరుకున్న సైపుల్లాను రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు డి హీరేహాళ్ ఎస్‌హెచ్‌ఓ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. కాగా, విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు దిలావర్‌బాషా... రాయదుర్గంలోని ఆస్పత్రి వద్దకు చేరుకుని మృతుడి తండ్రి మస్తానప్ప, కుటుంబసభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసానిచ్చారు. అలాగే పలువురు టీడీపీ నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చొరవ తీసుకుంటామన్నారు.

సంస్కరణలతో విద్యారంగం తిరోగమనం

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలతో విద్యారంగం తిరోగమన దిశలో ప్రయాణిస్తోందని ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడారు. 117 జీఓతో పాఠశాల విద్య దెబ్బతినిందన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో తీసుకుంటున్న నిర్ణయాలు మరోసారి ప్రభుత్వ బడులను బలహీనపరిచేలా ఉన్నాయన్నారు. 20 శాతం పాఠశాలను ఆదర్శ పాఠశాలలుగా మార్చడం అంటే 80 శాతం పాఠశాలలను అనాథగా చేయడమా? అని ప్రశ్నించారు. అనంతరం డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, నాయకులు ఎం. వెంకటసుబ్బయ్య, రఫీ, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస నాయక్, డీటీఎఫ్ నాయకులు జార్జ్, పురుషోత్తం, పీడీఎస్‌యూ నాయకులు వీరేంద్ర, శంకర్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కుల్లాయిస్వామి, వంశీ, చందు పాల్గొన్నారు.

రైల్వే పనుల పరిశీలన


రైల్వే స్టేషన్‌లో చేపట్టిన పనులపై ఆరా తీస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం సాయంత్రం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన ప్లాట్‌ఫారంల పనులపై స్థానిక అధికారులతో ఆరా తీశారు. త్వరలో చేపట్టనున్న రెండవ ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్ తదితర ప్రాంతాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక స్టేషన్ మాస్టర్ అనిల్‌కుమార్ ఉన్నారు.

మీ సేవలు వెలకట్టలేనివి

అనంతపురం అర్బన్: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ అందించిన సేవలు వెలకట్టలేనివని ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, సిబ్బందిని కలెక్టర్ వినోద్‌కుమార్ అభినందించారు. ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, సిబ్బందికి శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జిల్లా యంత్రాంగం తరపున ఆత్మీయ సన్మానం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ఉద్యోగ విమరణ చేసిన వారిని సన్మానించారు. ఉల్లాసంగా ఉంటూ వీలైనంత సమయాన్ని సామాజిక, ఆధ్యాత్మిక సేవలో గడపాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ శివ్‌నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ మలోల, ఉద్యోగ విమరణ చేసిన ఉద్యోగులు వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.


ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, సిబ్బందితో కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ మలోల

రేపటి నుంచి కోటంక తిరునాల

గార్లదిన్నె: జిల్లా కేంద్రానికి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న గార్లదిన్నె మండలం కోటంక గ్రామంలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రంలో ఈ నెల 2 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. స్వామికి విశిష్టమైన వారాల్లో మాత్రమే ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఉత్సవాలు నాలుగు వారాలు పాటు భక్తిశ్రద్ధలతో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఆలయ ఈఓ ఈశ్వరరెడ్డి, ప్రధాన అర్చకుడు రామాచార్యులు శుక్రవారం వెల్లడించారు. ఉత్సవాల్లో ప్రధానంగా ఈ నెల 15న రథోత్సవం, 16న శ్రీవారి కల్యాణోత్సవం, తిరునాల ఉంటాయి. 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని విశేష పూజలు, అభిషేకాలతో ఉత్సవాలు ముగుస్తాయి. తిరునాల సందర్భంగా జిల్లా కేంద్రం నుంచి కోటంకకు ప్రత్యేక బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేస్తోందని ఆలయ ఈఓ వెల్లడించారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

క్లుప్తంగా

ముగిసిన ఆధార్ క్యాంపులు



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన ఆధార్ క్యాంపులు శుక్రవారంతో ముగిసినట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ లావణ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆధార్ క్యాంపును ఎంపీపీ సుబ్బర హేమలత పరిశీలించారు. ఇప్పటి వరకూ ఎంత మంది చిన్నారులకు ఆధార్ కార్డులు తీశారు? తీయించుకోని చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకూ నిర్వహించిన ఆధార్ క్యాంపుల్లో 238 మంది చిన్నారులకు ఆధార్ కార్డులు తీసినట్లు తెలిపారు. ఇంకా 0–5 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న పిల్లలకు ఆధార్ కార్డులు లేకుంటే వారికి కూడా ఆధార్ కార్డులు తీయిస్తామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం పక్కాగా అందించాలన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం



యోగా చేస్తున్న పోలీసులు

అనంతపురం: విధుల్లో ఒత్తిడిని అధిగమించేందుకు యోగా దోహదపడుతుందని ఏఆర్ అదనపు ఎస్పీ షేక్ ఇలియాజ్ బాషా అన్నారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించేలా పోలీస్ పరేడ్ మైదానంలో పోలీసులకు యోగా నిర్వహించారు. యోగా సాధనతో మానసికంగా, భౌతికంగా దృఢత్వం కలిగి ఉంటారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను అలవాటుగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, ఆర్ఐ మధు, ఆర్ఎస్ఐ జాఫర్, మగ్బూల్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు

అనంతపురం సిటీ: కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు ఇద్దరు జిల్లా స్థాయి అధికారులకు జెడ్పీ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. వారిలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. గురువారం సాయంత్రం నిర్వహించిన జూమ్ మీటింగ్‌కు పైన పేర్కొన్న ఇద్దరు అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా డుమ్మా కొట్టడాన్ని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తీవ్రంగా పరిగణించినట్లు తెలిసింది. వారిద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో జెడ్పీ అధికారులు నోటీసులు జారీ చేశారు. వారిచ్చే సంజాయిషీ ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయి.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

అనంతపురం: నగరంలోని తపోవనం సర్వీసు రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. వివరాలు.. మూడో రోడ్డుకు చెందిన తెరువాయి గోపీశర్మ, సత్యవతి బళ్లారి బైపాస్ నుంచి సర్వీసు రోడ్డు ద్వారా మూడో రోడ్డుకు స్కూటీపై వెళ్తున్నారు. వీరు వెళ్తున్న స్కూటీని ఐచర్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో దంపతులు ఇద్దరూ కిందపడటంతో గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు: హంపాపురం సమీపంలో వెలసిన మౌనగిరి క్షేత్రానికి రూ.20 లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డుకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే పరిటాల సునీత శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మౌనగిరి క్షేత్రాన్ని పర్యాటక కేంద్రాంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. మౌనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు ఈశ్వరయ్య స్వామి వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆంజనేయ స్వామి చిత్రపటాలు అందజేసి సత్కరించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

రాప్తాడు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలు ఎంత మంది ఉన్నారు? ఎంత మంది హాజరయ్యారని ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. పాలు, గుడ్లు, పౌష్టికాహారం నాణ్యతను పరిశీలించారు.

కొత్త రేషన్ కార్డుల మంజూరు ఎప్పుడో?



- అధికారంలోకి వచ్చి 7 నెలలు అవుతున్నా కొత్త కార్డులు మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పేదలు
- పట్టించుకోని అధికారులు



రాప్తాడు: కూటమి ప్రభుత్వం రేషన్ కార్డు దరఖాస్తుదారులు షాక్ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కావస్తున్నా.. ఇప్పటి వరకు ఒక్కరికి కూడా కొత్త రేషన్ కార్డు మంజూరు చేసిన దాఖలాలు లేవు. రేషన్‌కార్డుల కోసం ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాకుండా దరఖాస్తులు స్వీకరించలేమని సచివాలయ సిబ్బంది చెబుతుండటంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. ప్రధానంగా కొత్త రేషన్ కార్డులతో పాటు ఉన్న కార్డుల్లో అనేక తప్పులు దొర్లాయి. ఒకరి ఆస్తి పన్నుకు మరొకరి ఆధార్‌కార్డును జత చేశారు. అలాగే ఎటువంటి ఇల్లు లేకుండానే ఉన్నట్లు తప్పుగా నమోదు చేశారు. ఇలా చాలా కార్డుల్లో తప్పులు ఉన్న కారణంతో పథకాలకు దూరమయ్యారు. కాగా.. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూడా కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించలేదు.

మళ్లీ 2014 మాదిరిగానే?

2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం అరకొరగా రేషన్‌కార్డులను మంజూరు చేసింది. అప్పట్లో జన్మభూమి కమిటీల పెత్తనంతో కార్డులు మంజూరయ్యేవి. దీంతో చాలా మంది అర్హులకు కార్డులు దక్కేవి కావు. ఈ కారణంగా కార్డులు రాని వారు నిరాశకు గురయ్యేవారు. చాలా మంది ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. కనీసం నిత్యావసరాలు అందక ఇబ్బందులు పడ్డారు. మళ్లీ కార్డుల మంజూరులో కూటమి నేతలు జోక్యం చేసుకుంటే రేషన్‌కార్డుల మంజూరులో కోతలు పడే అవకాశాలున్నాయని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

పాత కార్డుల తొలగింపు

కొత్త రేషన్ కార్డులు మాత్రమే కాదు.. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో కొత్తవి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్త రేషన్ కార్డుల డిజైన్లను ఎంపిక చేసి ముద్రించి పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం ప్రజల దగ్గర ఉన్న కార్డులను పూర్తిగా మార్చనున్నారు. క్యూఆర్ కోడ్‌తో పాటు కుటుంబ సభ్యుల చిత్రాలతో వీటిని ముద్రిస్తారు. తల్లిదండ్రుల నుంచి విడిపోయిన వారు, ఒంటరిగా ఉన్న వారికి రేషన్ కార్డులు ఇస్తారు. వినియోగంలో లేని కార్డులను తొలగించి కొత్త కార్డులు జారీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. కొందరు కార్డుదారులు ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకోవడం లేదని అధికారులు గుర్తించారు. ఈ కార్డులు తొలగిస్తే ప్రభుత్వానికి ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వ పథకాలు అందడం లేదు



రేషన్‌కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ఇప్పుడు ప్రతి పథకానికి రేషన్ కార్డు తీసుకుంటున్నారు. రేషన్‌కార్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రేషన్ సరుకులు అందడం లేదు. ఎప్పుడు ఇస్తారో కూడా తెలియడం లేదు. గ్రామ సచివాలయం వద్దకు వెళ్లే.. ఇంకా మార్గదర్శకాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. అసలు రేషన్‌కార్డులు ఇస్తారా అని అనుమానం వస్తోంది.

– అన్నపూర్ణ, రాప్తాడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్‌కార్డులు

అధికారంలోకి వచ్చేందుకు చాలా హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. గెలిచాక ప్రజల శ్రేయస్సును విస్మరిస్తోంది. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా రేషన్ కార్డుల ఊసే ఎత్తడం లేదు. దీంతో దరఖాస్తు దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్డుదారులకు ప్రభుత్వం ప్రతి నెలా బియ్యం, చక్కెర, కంది బెడలు వంటి సరుకులు అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దరఖాస్తుదారులుకు విరివిరిగా రేషన్ కార్డులు అందజేసింది. సచివాలయాలను వేదికగా చేసుకుని గంటల వ్యవధిలోనే రేషన్ కార్డులు ఇచ్చి చరిత్ర సృష్టించింది. అది కూడా వలంటీర్లు అర్హుల ఇంటి వద్దకే వెళ్లి దరఖాస్తులు స్వీకరించారు. కార్డు మంజూరు అయ్యాక ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్ జగన్ పాలనలో మధ్యవర్తుల జోక్యం లేకుండా అర్హులకు రేషన్‌కార్డులు అందాయి. పారదర్శకతకు పెద్దపీట వేశారు.

ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇవ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

అనంతపురం అర్బన్: 'అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు ఇస్తాము. ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామంటూ ఎన్నికల సమయంలో చంద్ర హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు మాటమారుస్తూ ఆటో రంగాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారు.' అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్ మండిపడ్డారు. ఆటో కార్మికుల ఉపాధిని పోగొడుతున్న ర్యాపిడోను తరిమివేయాలని పిలుపునిచ్చారు. ఇవే డిమాండ్లతో ఈనెల 3వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామని తెలిపారు. ర్యాపిడోకు వ్యతిరేకంగా శుక్రవారం స్థానిక రుద్రంపేట బైపాస్ రోడ్డు నుంచి ఆటో కార్మికులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడారు. నగరంలో దాదాపు 20 వేల మంది కార్మికులు ఆటోలు నడుపుకుంటూ ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ రంగానికి కొత్త నిబంధనలు పేరుతో ఆటో కార్మికుల శ్రమను దోచుకోవడానికి ర్యాపిడో భూతాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. దీంతో కార్మికులు ఉపాధి కోల్పోయే పరిస్థితి వస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర నాయకులు రామిరెడ్డి, ముర్తుజా, సురేంద్ర, రామలింగారెడ్డి, గోపాల్, వలి, ఆటో యూనియన్ నాయకులు ఆజాం, ఆది, ఇర్ఫాన్, లతీఫ్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీనరసింహ

ఆత్మకూరు: ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండాలి. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను గ్రామాల్లో ఏర్పాటు చేయించాం. గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ సూచించారు. శుక్రవారం మండలంలోని ముట్టాల గ్రామంలో పర్యటించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలోని చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని తెలిపారు. వర్మీకంపోస్టు తయారు చేసి ఆదాయం పెంచుకోవాలని సూచించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సిబ్బందికి తెలిపారు. సామాజిక పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందజేయాలని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

కిమ్స్–సవీరాలో అరుదైన శస్త్రచికిత్స



సర్జరీ వివరాలను తెలియజేస్తున్న వైద్య బృందం

అనంతపురం మెడికల్: కిమ్స్–సవీరా ఆస్పత్రిలో ఓ అరుదైన శస్త్రచికిత్స విజయవంతమైంది. అందుకు సంబంధించి వివరాలను శుక్రవారం కిమ్స్–సవీర ఆస్పత్రిలో న్యూరో సర్జన్లు డాక్టర్ మురళీ, డాక్టర్ అనిల్ తదితరులు వెల్లడించారు. వైఎస్సార్ జిల్లా పులివెందులకు చెందిన 58 ఏళ్ల ఆదినారాయణమ్మ ఏడాది నుంచి తలనొప్పి, తల తిరగడం, తదితర సమస్యతో బాధపడింది. గతేడాది నవంబర్‌లో వైద్యులు ఆదినారాయణమ్మకు వైద్య పరీక్షలు చేసి మెదడులో ఏకంగా 5 సెంటీమీటర్లకు పైగా టెంటోరియల్ మెనింజియోమా అనే కణితి ఉన్నట్లు నిర్ధారించారు. గతేడాది నవంబర్ 29న సర్జరీ చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి బాగుందని వైద్యులు తెలిపారు. అధ్యానుకి క్రిటికల్ కేర్ సెటప్‌తో శస్త్రచికిత్సను విజయవంతం చేయడం జరిగిందన్నారు. సమావేశంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అబీబ్ రాజా, క్రిటికల్ కేర్ హెచ్ఓడీ డాక్టర్ రవిశంకర్, సీఓఓ కే సిద్దారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ సంగీత సభ వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న సుగమ్య శంకర్

అనంతపురం కల్చరల్: త్యాగరాజ సంగీత సభ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. బెంగళూరు నుంచి విచ్చేసిన సుప్రసిద్ధ నాట్య కళాకారిణి సుగమ్య శంకర్ భరతనాట్యంతో ఆకట్టుకుంది. అనంతరం త్యాగరాజ సంగీత సభ అధ్యక్షులు ఎన్‌సీ సంపత్ కుమార్, వ్యవస్థాపకుడు జ్ఞానేశ్వరరావు ఉత్తార్కర్ మాట్లాడుతూ.. 1959 జనవరి 31న మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం వేదికగా సభ ప్రారంభమైందని తెలిపారు. ఇన్ని దశాబ్దాల చరిత్రలో ఎంతో మంది సంగీత నృత్య, పద్మశ్రీ, పద్మభూషణ్, భారతరత్న పురస్కారాల నందుకున్న దిగ్గజాలు అనంతకు విశేష ఖ్యాతి తెచ్చారని గుర్తు చేసుకున్నారు. 1986లో రజతోత్సవం, 2008లో స్వర్ణోత్సవం, 2018లో వజ్రోత్సవం పూర్తి చేసుకున్న సభ ఈ ఏడాది 66వ వార్షికోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులోనే త్యాగరాజ సంగీత సభ ప్రతిభ కల కళాకారులను గుర్తిస్తూ సాంస్కృతిక సేవలో కొనసాగుతుందన్నారు. అనంతరం నాట్యకళాకారిణి సుగమ్య శంకర్, ఆమె తల్లిదండ్రులు రవిశంకర్, గాయత్రిని సత్కరించారు. కార్యక్రమంలో సభ సభ్యులు జనప్రియకవి ఏలూరు యంగన్న చార్టెడ్ అకౌంటెంట్ హరిచంద్రరామ, సీనియర్ న్యాయవాది నామసేవ హరికృష్ణ, పారిశ్రామికవేత్త ముడార్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినం



పూజల్లో పాల్గొన్న భక్తులు

అనంతపురం కల్చరల్: ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత వాసవీ కన్యకా పరమేశ్వరీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొత్తూరు అమ్మవారి శాలలో గోపా మచ్చానరసింహులు నేతృత్వంలో, పాతూరు వాసవీ మాత దేవస్థానంలో పిన్ని నాగరత్నం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవలు, సామూహిక కుంకుమార్చన, అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహించారు. అనంతరం వాసవీ హోమాలు ఘనంగా జరిగాయి. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆత్మీయ అతిథులుగా అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు (బలిజ) కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ కార్పొరేషన్ కింద 29 యూనిట్లకు గాను రూ.54.50 లక్షలు, ఈబీసీ కార్పొరేషన్ కింద 2 యూనిట్లకు గాను రూ.3.47 లక్షలు, కమ్మ కార్పొరేషన్ కింద 1 యూనిట్‌కు రూ.1.74 లక్షలు, రెడ్డి కార్పొరేషన్ కింద 1 యూనిట్‌కు రూ.1.72 లక్షలు, కాపు (బలిజ) కార్పొరేషన్ కింద 8 యూనిట్లకు రూ.28 లక్షలు అందజేస్తామన్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 41 యూనిట్లకు గాను రూ.89.43 లక్షలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పౌరహక్కులపై అవగాహన

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. సంబంధిత సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీసులతో పాటు రెవెన్యూ తదితర ప్రభుత్వ విభాగాలు సంయుక్తంగా రాజ్యాంగంలోని చట్టాలు, పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: మట్టిలో మాణిక్యాల్లాంటి ప్రతిభావంతులను గుర్తిస్తున్న సర్వేజనా సుఖినోభవంతు సంస్థ 8వ వార్షికోత్సవం సందర్భంగా సేవాభూషణ్, విద్యాభూషణ్ జాతీయ పురస్కారాలు అందజేయనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఈఎస్ఎస్ నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా రంగాల్లో రాణిస్తున్న వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 5వ తేదీలోపు 'సర్వేజనా సుఖినోభవంతు, డోర్‌నం. 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్-15' చిరునామాకు దరఖాస్తులు పంపాలన్నారు. ఈనెల 9వ తేదీన హైదరాబాద్‌లో వార్షికోత్సవ పురస్కారాల పేరుతో సాగే సభలో ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు అందజేస్తామన్నారు. వివరాలకు 9652347207 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎస్టీ మహిళలపై దాడి



మహిళను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

అనంతపురం: రస్తాను ఆక్రమించి భవనం నిర్మిస్తున్నారంటూ అధికారులకు ఫిర్యాదు చేశారనే కారణంతో ఇద్దరు ఎస్టీ మహిళలపై శుక్రవారం దాడి జరిగింది. వివరాలు.. అశోక్ నగర్‌లో అటు వంక, ఇటు రహదారిని ఆక్రమించి ఇళ్లు నిర్మించడంతో స్థానిక ప్రజలు రాకపోకలు, కాలనీవాసులకు ఇబ్బంది అవుతోందని ఎరుకల లక్ష్మీదేవి, ఎరుకల రమాదేవి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆగ్రహానికి గురైన హైదర్‌బీ, సాహెబ్బి, సుశీల్, మనోజ్, సుధీర్ రెడ్డి, రవి తదితరులు ఎస్టీ మహిళలపై సిమెంట్ పెళ్లలు, కట్టెలతో దాడికి దిగారు. ఈ ఘటనలో ఇద్దరు మహిళలకు రక్తగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ అంశంపై ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ పోలీసులపై చర్యలు తీసుకోవాలి



డీఎస్పీ వి.శ్రీనివాస రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం: టవర్‌క్లాక్ సమీపంలో డిసెంబర్ 27వ తేదీన ప్రేమ్‌కుమార్‌తో పాటు ఆయన స్నేహితులపై ట్రాఫిక్ పోలీసులు దాడి చేశారు. చట్టాన్ని చేతుల్లో తీసుకున్న ట్రాఫిక్ పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఫైట్ ఫర్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు కేపీ రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాస రావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మఫ్టీలో ఉన్న పోలీసులు అందరూ మూకుమ్మడిగా దాడి చేయడం, బూటు కాళ్లతో తన్నడం సోషల్ మీడియాలోనూ వైరల్ అయ్యాయి. అయినప్పటికీ వారిపై చర్యలు తీసుకోకపోగా, బాధితుల పైనే కేసులు నమోదు చేసి హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని తెలిపారు. సుమోటోగా కేసు నమోదు చేయాల్సిన పోలీసులు మౌనంగా ఉండటంపై సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి తదితరులు పాల్గొన్నారు.

'ఫైళ్లు పెండింగ్ పెట్టడం సరికాదు'

అనంతపురం ఎడ్యుకేషన్: ఏమి ఆశించి సెక్షన్‌కు వచ్చిన ప్రతి ఫైలూ పెండింగ్ పెడుతున్నారని ఎంఈఓ–2 సంఘం రాష్ట్ర నాయకుడు రామచంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంఈఓ–2 సంఘం నాయకులు సమగ్రశిక్ష కార్యాలయానికి వెళ్లారు. ఎస్టాబ్లిస్‌మెంట్ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ పెద్దయ్యను కలిశారు. వివిధ ఫైళ్లపై ఆరా తీస్తూ ఎందుకు రోజుల తరబడి మీ వద్దే పెట్టుకుంటున్నారంటూ మండిపడ్డారు. ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ ఉద్యోగులను రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ పనులు చేయడం లేదని మండిపడ్డారు.

నిబంధనలకు విరుద్ధంగా పోస్టు కేటాయింపు?

సమగ్రశిక్ష కార్యాలయంలో సెక్షన్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పెద్దయ్యకు నిబంధనలకు విరుద్ధంగా సెక్టోరియల్ ఆఫీసర్ పోస్టు ఇన్‌చార్జ్ ఎలా ఇస్తారని రామచంద్ర ప్రశ్నించారు. ఆ పోస్టుకు అర్హులైన ఎంఈఓలు, హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు చాలామంది ఉన్నారన్నారు. వారిలో ఎవరికైనా ఇన్‌చార్జ్ ఇవ్వాల్సింది పోయి అనర్హుడైన పెద్దయ్యను ఆ సీటులో కూర్చోపెట్టడం వెనుక అంతర్యమేమిటని నిలదీశారు. ఈ అక్రమ వ్యవహారాన్ని కలెక్టర్‌తో పాటు ఎస్పీడీ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఎమ్మెల్యే గుమ్మనూరుపై చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: విలేకరులను బెదిరిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విలేకరులను చంపుతామని బెదిరించడం దుర్మార్గమన్నారు. పార్టీలు మారడం, దౌర్జన్యాలు చేయడం గుమ్మనూరు జయరాంకు సరికాదన్నారు. అధికారుల సమక్షంలోనే విలేకరులను చంపి రైలు పట్టాలపై పడేస్తామని చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. విలేకరులకు రక్షణ కల్పించకపోతే కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో కేపీ రాజు, నారాయణ స్వామి, టీవీ రెడ్డి, మాధవ్, రామకృష్ణ, వెంకటేశులు, సుధాకర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

కేఎస్ఎన్‌లో జాబ్‌మేళా



మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీవీ ప్రతాప్ రెడ్డి

అనంతపురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయిమెంట్, సీడాప్ సంయుక్తంగా కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. 48 మంది విద్యార్థులకు ఉద్యోగాలు దక్కాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కేసీ సత్యలత, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీవీ ప్రతాప్ రెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కళ్యాణి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ కళ్యాణి, బి.అనూరాధ, నారాయణ స్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా నిర్మాణాలు



అరవింద నగర్‌లో అనధికారికంగా సెల్లార్‌ను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల ఆశీస్సులతో నగరంలో ఇష్టానుసారంగా అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయి. సెల్లార్లకు అనుమతి లేకున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం పెద్ద చర్చనీయాంశమైంది. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా నిర్మాణదారులు పెద్ద ఎత్తున గుంతలు తీసేస్తున్నా.. అటువైపు తొంగి చూడడం లేదు. నగరంలోని అరవింద నగర్‌లో భారీగా సెల్లార్ నిర్మాణం జరుగుతోంది. నిర్మాణదారుడు జీప్లస్–2 భవనానికి దరఖాస్తు చేసుకున్నారు. స్టిల్ట్ పేరుతో ఏకంగా సెల్లార్‌ను తవ్వేశాడు. ఇన్‌చార్జ్ ఏసీపీ శిరీష, ప్లానింగ్ కార్యదర్శి శ్రావణి ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. తమకేం పట్టదన్న ధోరణితో వ్యవహరిస్తున్నారు.

గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు



గొర్రెకు నట్టల నివారణ మందు తాపిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి, రాచానపల్లి గ్రామాల్లో శుక్రవారం పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పశువులు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు. అలాగే సాధారణ చికిత్సలతో పాటు గర్భ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కక్కలపల్లిలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు చంద్రకుమార్, సర్పంచ్ కృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యులు ఓబిలేసు, పశుసంవర్ధక శాఖ డీడీ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ శారద, సిబ్బంది అమ్రీన్, మాధవరాజు, షఫీ, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. రాచానపల్లిలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణ, డాక్టర్ శ్వేత, సిబ్బంది సుష్మ, జగదీష్, మాధవరెడ్డి పాల్గొన్నారు.